ఘనంగా ఘృతశర్కరాభిషేకం



ఘృతశర్కరాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

చిక్కడపల్లి, నవంబర్ 17(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని లక్ష్మీగణపతి ఆలయం ఆవరణలోని పార్వతీక్షీరలింగేశ్వర స్వామి మందిరంలో కార్తీకమాసోత్సవాలను పురస్కరించుకుని సోమవారం ఘృతశర్కరాభిషేకం ఘనంగా నిర్వహించారు. పంచదారతో స్వామివారిని ఈ సందర్భంగా అభిషేకించారు. ఆలయంలో సాగుతున్న ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. స్వామివారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, ఆకాశ దీపోత్సవం కార్యక్రమాలు జరిగాయి. ఆలయ ఈవో లక్ష్మారెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కార్తీక వనభోజనాలు



ఉసిరి చెట్టు పూజలో పాల్గొన్న సూర్యప్రకాష్

చిక్కడపల్లి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా నిర్వహించే కార్తీక వనభోజనాలు ప్రజల్లో ఐక్యతను పెంపొందిస్తాయని అశోక్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బాసాని సూర్యప్రకాష్ అన్నారు. సోమవారం వెల్ఫేర్ సెంటర్ ఆధ్వర్యంలో అశోక్‌నగర్ పార్కులో కార్తీక వనభోజన కార్యక్రమంతోపాటు ఉసిరి చెట్టుకు పూజ, శివునికి రుద్రాభిషేకం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో చిక్కడపల్లి వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయస్వామి ఆలయం పూర్వ ఛైర్మన్ పద్మాసూర్యప్రకాష్, వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అంజిబాబు, సంయుక్త కార్యదర్శి పద్మావతి పాల్గొన్నారు.



ఆలయ పాలక మండలి ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న సభ్యులు

ఆలయ పాలక మండలి ప్రమాణ స్వీకారం

రాంనగర్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రాంనగర్ డివిజన్‌లోని దయారమా ర్కెట్‌లోని సీతారామాంజనేయస్వామి ఆలయం జెమినికాలనీలోని పోచమ్మ ఉమ్మడి ఆలయాలకు నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. దేవాలయాల కమిటీ ఛైర్మన్‌గా ఉరెల్లి జనార్దన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా లింగాల శ్రీకాంత్‌గౌడ్, కోశాధికారిగా బీబీనగర్ రవిచారి, ధర్మకర్తలుగా బొల్లంపల్లి లక్ష్మణ్ రెడ్డి, కాసాని శివప్రసాద్‌గౌడ్, గాండ్ల ప్రసాద్, ప్రేమ్, కుమార్, రమాకాంత్, బండారు జగపతి, బండారు శ్రీనివాస, జయప్రకాష్, సలహాదారులుగా మాజీ కార్పొరేటర్ ఆర్.కల్పనయాదవ్, సూర్యనారాయణగౌడ్, రమేష్, ప్రభాకర్ నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో బొల్లంపల్లి రాంరెడ్డి, మాజీ ఛైర్మన్ శ్రీనివాస్, మాజీ ప్రధాన కార్యదర్శి పూసరాజు, లక్ష్మణ్, గోవింద్, జనార్దన్ పాల్గొన్నారు.

రాఘవేందర్‌కు ఓయూ డాక్టరేట్



రాఘవేందర్‌కు డాక్టరేట్‌ను అందజేస్తున్న సూర్యాధనంజయ్

చిక్కడపల్లి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం ఎల్వర్తిగ్రామానికి చెందిన కావలి రాఘవేందర్‌కు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ పట్టాను ప్రకటించింది. తెలుగు సాహిత్యంలో చేసిన విస్తృతమైన పరిశోధనను వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య సూర్యాధనంజయ్ పర్యవేక్షణలో సాహిత్య చరిత్రలు- తెలంగాణ సాహి త్యం అనే అంశంపై కావలి రాఘవేందర్ పరిశోధన చేశారు. ఈ పరిశోధనకు గా ను ఉస్మానియా యూనివర్సిటీ ప్రతిష్టాత్మక డాక్టరేట్‌ను(పీహెచ్‌డీ)ఈనెల 15న ఉస్మానియా విశ్వవిద్యాలయం పరీక్షల విభాగం ఈ మేరకు అధికారికంగా ప్రకటించింది. డాక్టరేట్ పట్టా సాధించిన సందర్భంగా కావలి రాఘవేందర్‌కు అధ్యాపకులు, కుటుంసభ్యులు మిత్రులు సాహితీవేత్తలు బంధవులు గ్రామస్థులు అభినందలు తెలియజేశారు.

రోడ్డుపై గుంతపూడ్చే పనులు పూర్తి



పనులు పూర్తి కావడంతో రోడ్డుపై మట్టిని పూడ్చివేస్తున్న దృశ్యం

చిక్కడపల్లి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): అశోక్‌నగర్ చౌరస్తా మెయిన్‌రోడ్డులో గుంత ఏర్పడి రోడ్డు కుంగడంతో సోమవారం అక్కడ పనులు పూర్తి చేసినట్లు వాటర్‌బోర్డ్ డీజీఎం కార్తీక్ రెడ్డి తెలిపారు. భూమిలో పల సీవరేజ్ పైప్‌లైన్ పగిలిపోవడం వల్ల రోడ్డు కుంగిపోయిందని తెలిపారు. ఈ క్రమంలో రోడ్డును తవ్వి సమస్యను పరిశీలించామని తెలిపారు. రెండు ఫీట్ల నిడివి గల పైప్‌లు 20మీటర్ల వరకు నూతన లైన్ ఏర్పాటు చేశామని సమస్యను పరిష్కరించామని తెలిపారు. రోడ్డును ఎక్సకవేటర్ సాయంతో మట్టితో పూడ్చివేస్తున్నారని మూడు రోజుల అనంతరం రోడ్డును ఏర్పాటు చేస్తారని ఆ తర్వాత యథావిధిగా వాహనాలు, పాదచారుల రాకపోకలు సాగుతాయని డీజీఎం కార్తీక్‌రెడ్డి వివరించారు.



అధ్యక్షుడిగా మనోహర్‌రెడ్డి పేరును ప్రకటిస్తున్న ఎన్నికల అధికారులు

వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్షుడిగా మనోహర్‌రెడ్డి ఏకగ్రీవం

రాంనగర్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : సుందరయ్యపార్కు వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్షుడిగా ఎస్.మనోహర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ అధ్యక్ష పదవికి ఎస్.మనోహర్‌రెడ్డితో పాటు వి.కల్యాణ్‌నాయక్ పోటీ పడ్డారు. అయితే కల్యాణ్‌నాయక్ పోటీ నుంచి తప్పుకోవడంతో మనోహర్‌రెడ్డిని అధ్యక్షుడిగా ఎన్నికల అధికారులు టి.రవికుమార్, శరత్‌కుమార్ ప్రకటించారు. సంవత్సరం పాటు పదవిలో కొనసాగుతాడని తెలిపారు. ఈ సందర్భంగా మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ సుందరయ్య పార్కు అభివృద్ధితో పాటు క్లబ్ సభ్యులు, వాకర్స్‌కు మెరుగైన సదుపాయాలను కల్పిస్తామన్నారు. తమను ఏకగ్రీవంగా ఎన్నుకున్న సభ్యులందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సుందరయ్యపార్కులో పచ్చదనం కాపాడాలి



ప్రజావాణిలో జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న శ్రీనివాస్‌రావు, వీరయ్య

రాంనగర్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : నగరంలోని సుందరయ్యపార్కులో పచ్చదనాన్ని కాపాడాలని కోరుతూ సోమవారం ప్రజావాణిలో జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్‌కు హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, ప్రధాన కార్యదర్శి వీరయ్యలు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్కులోని పచ్చదనాన్ని తొలగించి పిల్లల ఆట వస్తువులు నిర్మాణం చేయడం సరికాదన్నారు. పార్కులో కలుషిత వాతావరణం లేకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో భవానీశంకర్, రమేష్, శంకరయ్య పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

● మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ



అన్నదానాన్ని ప్రారంభిస్తున్న మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఆలయ కమిటీ ఛైర్మన్ రవీందర్ తదితరులు

కవాడిగూడ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కవాడిగూడ డివిజన్‌లోని అడ్వకేట్ కాలనీలో ఉన్న బాలత్రిపురసుందరీ ఆలయంలో ఆలయ కమిటీ ఛైర్మన్ మాజీ కార్పొరేటర్ టి రవీందర్ ఆధ్వర్యంలో సోమవారం శివపార్వతుల కల్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ శివపార్వతుల కల్యాణంలో పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని బండారు దత్తాత్రేయ, రవీందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ ఆధ్యాత్మిక భావనతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని అన్నారు. ఆధ్యాత్మిక భావనను పెంపొందించేందుకు బాలత్రిపుర సుందరీదేవి ఆలయ కమిటీ సభ్యులు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు జి వెంకటేష్, ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్‌యాదవ్, నగరనాయకులు ఎంసి మహేందర్‌బాబు, తాళ్లబస్తీ కమిటీ అధ్యక్షుడు ఎ ప్రభాకర్ గంగపుత్ర, బీజేపీనేతలు సీహెచ్ శ్రీనివాస ముదిరాజ్, శివరాజ్, బస్తీవాసులు పాల్గొన్నారు.

అందెశ్రీ మృతి సాహితీ ప్రపంచానికి తీరనిలోటు



అందెశ్రీకి నివాళులర్పిస్తున్న ఎఫ్ టామ్ సభ్యులు

చిక్కడపల్లి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): లోకకవి, వాగ్గేయకారుడు డా. అందెశ్రీ మృతి సాహితీ ప్రపంచానికి తీరనిలోటు అని సీనియర్ ఐఏఎస్ అధికారి, మధ్యప్రదేశ్ పబ్లిక్‌హెల్త్ శాఖ ముఖ్య కార్యదర్శి పి. నరహరి అన్నారు. మహారాష్ట్ర ఫెడరేషన్ ఆఫ్ తెలుగు అసోసియేషన్, ది లీగల్ ప్లాజా ఆధ్వర్యంలో సోమవారం చిక్కడపల్లిలోని ఎఫ్‌టామ్ కార్యాలయంలో అందెశ్రీ సంస్మరణ సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో నరహరి మాట్లాడుతూ సూర్యచంద్రులున్నంతవరకు అందెశ్రీ అన్న సాహిత్యం, జయజయహే తెలంగాణ రాష్ట్ర గీతం నిలిచి ఉంటుందన్నారు. ప్రముఖ కవయిత్రి డా. బండారు సుజాతశేఖర్ మాట్లాడుతూ అభినవ కాళిదాసు, నేటి బమ్మెరపోతన సాహిత్యశిఖరం, ఆత్మీయులు అందెశ్రీ మరణం తెలంగాణ ప్రజలను తీవ్ర మనస్తాపానికి గురిచేసిందన్నారు. బతుకమ్మ ఫౌండేషన్, సాహిత్యసమాజం ఆయనకు రుణపడి ఉంటుందన్నారు. సాహితీవేత్త దాచేపల్లి బుచ్చయ్య(శేఖర్) మాట్లాడుతూ మానవతావాది అందెశ్రీ అన్నారు. ఎఫ్‌టామ్ అధ్యక్ష, కార్యదర్శులు గంజి జగన్‌బాబు, కంటె అశోక్, గందూరి లక్ష్మీనారాయణ, వడిగొప్పు శంకర్, అంజిరెడ్డి తదితరులు అందెశ్రీపై కవితలు చదివారు. సుజాతశేఖర్ జయజయహే తెలంగాణ గీతాన్ని ఆలపించారు.

కాంతారావు తెలుగు చిత్రపరిశ్రమకు మూడోకన్ను



కాంతారావుకు నివాళులర్పిస్తున్న రేలంగి నరసింహారావు, పార్వతీశం, రామరాజు తదితరులు

చిక్కడపల్లి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): నాడు తెలుగు చిత్రపరిశ్రమకు ఎన్‌టీఆర్, ఏఎన్ఆర్ రెండు కళ్ళు కాగా కాంతారావు మూడవకన్ను అని ప్రముఖ సినీ దర్శకుడు రేలంగి నరసింహారావు అన్నారు. వంశీ ఆర్ట్స్ థియేటర్స్ ఆధ్వర్యంలో ప్రఖ్యాత నటుడు కాంతారావు 102వ జయంతి సందర్భంగా కాంతారావు నటించిన సినిమా పాటలను వైఎస్ రామకృష్ణ బృందం సోమవారం రాత్రి త్యాగరాయగానసభలో ఆలపించారు. అనంతరం జరిగిన సభలో రేలంగి నరసింహారావు మాట్లాడుతూ పాతతరం మహనీయుల చరిత్ర మరుస్తున్న కాలంలో వంశీ వంటి సంస్థలు వారిని గుర్తుచేస్తున్నారని ప్రశంసించారు. క్రమశిక్షణ అంకిత భావం కాంతారావు నుంచి నేర్చుకున్నానని చెప్పారు. అధ్యక్షత వహించిన ప్రముఖ సాహితీవేత్త డా. ఓలేటి పార్వతీశం మాట్లాడుతూ తెలంగాణ నుంచి వచ్చి ఆ రోజుల్లో ఎదిగిన ఏకైక హీరో కాంతారావు అన్నారు. ఆయన సాంఘిక, పౌరాణిక, జానపద సినిమాలలో నటించి మెప్పించారన్నారు. నారద పాత్రలో ఆయనను మించిన నటుడు లేరు అన్నారు. వంశీ రామరాజు పర్యవేక్షణలో సాగిన సభలో గాయని రాధారాణి దంపతులు కాంతారావు కుమారుడు రాజుకు నగదు పురస్కారం అందజేశారు. రచయిత్రి డా. కృష్ణకుమారి, సుధామయి, సుంకరపల్లి శైలజ తదితరులు పాల్గొన్నారు.

నేడు శివపార్వతుల కల్యాణం

రాంనగర్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : లోకకల్యాణం కోసం కార్తీక మాసాన్ని పురస్కరించుకుని పూస స్వామి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం జెమినీకాలనీలో శివపార్వతుల కల్యాణమహోత్సవం నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ ప్రతినిధి, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పూస రాజు తెలిపారు. ఈ కల్యాణ వేడుకలకు భక్తులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా స్వామివారి ఎదుర్కోలు, దీపోత్సవం, పల్లకీసేవ, అన్నప్రసాద వితరణ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

రేపు జాతీయ సంగీత కళాకారుల సమ్మేళనం

చిక్కడపల్లి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ధన్వంతరి జయంతి ఉత్సవ సందర్భంగా జాతీయ సంగీత కళాకారుల సమ్మేళనం త్యాగరాయగానసభలో బుధవారం సాయంత్రం నిర్వహిస్తున్నామని జాతీయ కళాకారుల సంఘం అధ్యక్షుడు ఎల్. వి చెన్నారావు తెలిపారు. ఎంపీ ఈటల రాజేందర్ ముఖ్యఅతిథిగా పాల్గొనే సభలో ప్రత్యేక అతిథులుగా పూర్వ ప్రభుత్వ సలహాదారు డా. కేవీ రమణాచారి, ప్రముఖ పిల్లల వైద్యులు డా. మంచుకొండ రంగయ్య, సంస్కారభారతి అధ్యక్షుడు కెకెవి శర్మ హాజరవుతారన్నారు. ప్రముఖ కర్ణాటక సంగీత కళాకారుడు డివి మోహనకృష్ణ, గాంధీ, ఉస్మానియా, ఈఎన్‌టీ ఆస్పత్రుల సూపరింటెండెంట్‌లు ఎస్. వాణి, రాకేష్‌కుమార్, ఆనంద్‌ఆచార్య, ఈలపాట కళాకారుడు శివప్రసాద్, వైద్యులు నాగవర్ధన్‌బాబు, హరిప్రియలతోపాటు ఇతర రంగాల ప్రముఖులకు సత్కారం చేస్తామన్నారు.

బీసీ రిజర్వేషన్లపై చట్టం చేయాలి

● తెలంగాణ బీసీ పొలిటికల్ ఫ్రంట్ ఛైర్మన్ బాల్‌రాజ్‌గౌడ్



మాట్లాడుతున్న బాల్‌రాజ్‌గౌడ్ తదితరులు

రాంనగర్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : డిసెంబర్ మొదటి వారంలో జరిగే శీతాకాల పార్లమెంట్ సమావేశంలో 42శాతం బీసీ రిజర్వేషన్లపై చట్టం చేసి 9వ షెడ్యూల్‌లో చేర్చాలని తెలంగాణ బీసీ పొలిటికల్ ఫ్రంట్ ఛైర్మన్ బాలగౌని బాల్‌రాజ్ గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం చిక్కడపల్లిలోని బీసీ పొలిటికల్ ఫ్రంట్ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఫ్రంట్ నాయకులు యెలికట్టె విజయకుమార్‌గౌడ్, ఎస్.దుర్గయ్యగౌడ్, అంబాల నారాయణగౌడ్‌తో ఆయన మాట్లాడారు. నేడు జరుగుతున్న క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకుని అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి ప్రధాని మోదీతో చర్చించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పు కేంద్ర బడ్జెట్ మించిపోయిందని సాకుగా చూపి స్థానిక ఎన్నికలు నిర్వహిస్తామంటే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. మేమెంతో మాకంతా వాటా దక్కాలని డిమాండ్ చేశారు. చట్టబద్ధంగా రిజర్వేషన్లు ఇవ్వకుంటే బీసీల ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు. బీసీ రిజర్వేషన్లు తెచ్చాకే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫ్రంట్ నాయకులు వి.నాగభూషణం, గడ్డమీది విజయకుమార్‌గౌడ్, పోతగాని ఐలన్‌గౌడ్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కంపెనీ సెక్రటరీ ప్రొఫెషనల్‌లో ఉద్యోగ అవకాశాలు



సదస్సులో పాల్గొన్న శ్రీనివాస్‌కుమార్

రాంనగర్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కంపెనీ సెక్రటరీ ప్రొఫెషనల్‌లో విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు ఎక్కువ అ ని కంపెనీ సెక్రటరీ ఆఫ్ ఇండియా(ఐసీఎస్ఐ)హైదరాబాద్ చాప్టర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వి.శ్రీనివాస్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ నాక్ బీ ప్లస్ ప్లస్ లా కాలేజీ ఆధ్వర్యంలో కెరీర్ అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కంపెనీ సెక్రటరీ ప్రొఫెషన్‌లో శిక్షణ పొందిన వారికి మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సృజన, సీఎస్ఆర్ వెంకటరమణ, సీఎస్.నవీన్, శేఖర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పోటీపరీక్షల అభ్యర్థులు సమయపాలన పాటించాలి



మాట్లాడుతున్న నగర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పద్మజ

చిక్కడపల్లి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పోటీపరీక్షల అభ్యర్థులకు సమయపాలన ప్రధానమని హైదరాబాద్ నగరకేంద్రగ్రంథాలయ సంస్థ కార్యదర్శి పొ ట్లూరు పద్మజ అన్నారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా సోమవారం చిక్కడపల్లిలోని సిటిసెంట్రల్ లైబ్రరీలో పోటీపరీక్షలకు విద్యార్థులు ఎలా సన్నద్ధం కావాలి అనే అంశంపై సదస్సు జరిగింది. సదస్సును ప్రారంభించిన లైబ్రరీ కార్యదర్శి పద్మజ మాట్లాడుతూ పోటీపరీక్షలకు చదివే సమయంతోపాటు పరీక్షలు రాసే సమయాల్లో కూడా సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సిటీగ్రంథాలయంతో పాటు 82శాఖాగ్రంథాలయాల్లో కూడా పోటీపరీక్షల అభ్యర్థుల కోసం స్టడీమెటీరియల్ పుస్తకాలు అందుబాటులో ఉంచామన్నారు. అవసరమైన మరిన్ని పుస్తకాల సమాచారం ఇస్తే వాటిని తెప్పించి అందుబాటులో ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రథమశ్రేణి గ్రంథపాలకురాలు ఎల్. చంద్రకళ, ద్వితీయశ్రేణి గ్రంథపాలకురాలు బి. ప్రతిభారెడ్డి, నగర గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు, పోటీపరీక్షల అభ్యర్థులు, నిరుద్యోగులు పాల్గొన్నారు.

నల్లకుంట - బాగ్‌లింగంపల్లి రోడ్డు పనులు పూర్తి చేయాలి



జీహెచ్‌ఎంసీ చీఫ్ ఇంజనీర్ శ్రీరత్నాకర్‌కు వినతిపత్రం ఇస్తున్న నల్లకుంట సిటిజన్స్ అసోసియేషన్ ప్రతినిధులు

నల్లకుంట, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : నల్లకుంట నుంచి బాగ్‌లింగంపల్లి రోడ్డు పనులు వెంటనే పూర్తిచేయాలని నల్లకుంట సిటిజన్స్ అసోసియేషన్(ఎన్‌సీఏ) నేతలు సోమవారం జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ శ్రీరత్నాకర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈసందర్భంగా ఎన్‌సీఏ నేతలు మాట్లాడుతూ నల్లకుంట కూరగాయల మార్కెట్ హెరిటేజ్ వద్ద 2022లో ఎస్ఎన్‌డీపీ, జీహెచ్‌ఎంసీ బ్రిడ్జి ప్రాజెక్ట్ నిర్మాణానికి రూ.40కోట్లతో నాలా బ్రిడ్జి పనులు ప్రారంభమై 4సంవత్సరాలు అవుతున్నా పూర్తిస్థాయిలో రోడ్డు నిర్మాణ పనులు నిర్వహించడం లేదని ఆరోపించారు. నాలా, రోడ్డు నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యంతో నల్లకుంట కూరగాయల మార్కెట్ నుంచి బాగ్‌లింగంపల్లి, అచ్చయ్యనగర్, ఆదర్శనగర్ తదితర ప్రాంతాల్లో వ్యాపారాలు దెబ్బతిన్నాయని పలువురు వ్యాపారులు వాపోతున్నారని వారన్నారు. దీంతో కొంత మంది వ్యాపారులు షాపులను ఖాళీచేసి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోతున్నారని అన్నారు. ఈ ప్రాంతంలో రాకపోకలు సాగించడంలో పరిసర ప్రాంతాల ప్రజలు నానా ఇబ్బందులకు గురవుతున్నారని వారు వివరించారు. ఇకనైనా మూన్‌కేఫ్ వద్ద ప్రమాదకరమైన గుంతలకు మరమ్మతులు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నల్లకుంట సిటిజన్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మోహన్‌నాయుడు, నిర్వహణ కార్యదర్శి కె.వీరయ్య, సహాయ కార్యదర్శి భవానీశంకర్, నాయకులు శ్రీనివాసరావు, రమేష్, శంకరయ్య పాల్గొన్నారు.



నల్లకుంట కూరగాయల మార్కెట్ నుంచి బాగ్‌లింగంపల్లి వరకు గోతులమయమైన రోడ్ల దృశ్యం



మాట్లాడుతున్న జస్టిస్ నాగమారుతిశర్మ, పక్కన కళా జనార్దనమూర్తి

తెలుగు భాషా సేవకుడు బ్రౌన్

చిక్కడపల్లి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): తెలుగు భాషా సేవకుడు సీపీ బ్రౌన్ అని వక్తలు పేర్కొన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో జరుగుతున్న ఎందరో మహానుభావులు కార్యక్రమంలో భాగంగా సోమవారం సాయంత్రం సీపీ బ్రౌన్ జయంతి సమావేశం గానసభ అధ్యక్షుడు కళాజనార్దనమూర్తి అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న జస్టిస్ నాగమారుతిశర్మ మాట్లాడుతూ తెలుగు భాషపై విశేష అధ్యయనం చేసిన బ్రౌన్ భాషా నిఘంటువును అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. వేమన పద్య రచనలు గ్రంథరూపంలో వెలుగులోకి తెచ్చిన మహనీయుడు బ్రౌన్ అన్నారు. గానసభ పాలకమండలి సభ్యులు చక్రపాణి, గీతాదేవి తదితరులు పాల్గొన్నారు.



అనాథాశ్రమంలో విద్యార్థినులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ సికింద్రాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు మురళీమోజేస్, కృష్ణవేణి

అచ్చిరెడ్డి సేవలు మరువలేనివి

ముషీరాబాద్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : పగడాల అచ్చిరెడ్డి కాంగ్రెస్‌కు అందించిన సేవలు మరువలేనివని ఆ పార్టీ సికింద్రాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు మురళీమోజేస్ అన్నారు. సోమవారం పార్టీ సీనియర్ నాయకుడు అచ్చిరెడ్డి వర్ధంతి సందర్భంగా ముషీరాబాద్‌లోని రెయిన్‌బో హోం అనాథాశ్రమంలో ముషీరాబాద్ మహిళా కమిటీ అధ్యక్షురాలు కృష్ణవేణి ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హాజరైన మురళీమోజేస్ మాట్లాడుతూ పేదలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని తెలిపారు. ప్రతిఒక్కరూ సేవా భావాన్ని అవర్చుకొని పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వెంకటేష్, లింగంగుప్తా, రాజు, స్వామి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



కార్తీకమాస ఉత్సవాల సందర్భంగా ఆర్టీసీక్రాస్‌రోడ్‌లోని లక్ష్మీగణపతి ఆలయంలో సోమవారం సాయంత్రం గాంధీనగర్ కార్పొరేటర్ ఎ. పావనీవినయ్‌కుమార్ దంపతులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాదం వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. - చిక్కడపల్లి, ఆంధ్రజ్యోతి



కామారెడ్డి ఎమ్మెల్యే కాటేపల్లి వెంకటరమణారెడ్డి, లోక్‌సత్తా వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణను బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యురాలు గీతామూర్తి సోమవారం కలిశారు. విలువలు గల రాజకీయాల గురించి, ప్రజలకు నిస్వార్థంగా సేవ చేయాలనేది పలు విషయాలపై మాట్లాడుకున్నట్లు గీతామూర్తి తెలిపారు. - బర్కత్‌పుర, ఆంధ్రజ్యోతి.



బాగ్‌అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ బి.పద్మావెంకట్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం తిరుమల తిరుపతి వేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. - రాంనగర్, ఆంధ్రజ్యోతి

5కె రన్, కంటి స్క్రీనింగ్ కార్యక్రమం

బర్కత్‌పుర, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : ప్రపంచ మధుమేహ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలో ఐడియా క్లినిక్ ఆధ్వర్యంలో 5కె రన్, కంటి స్క్రీనింగ్‌ను నిర్వహించనున్నట్లు ఐడియా క్లినిక్ మేనేజర్ రామాంజనేయులు తెలిపారు. ఈ రన్‌ను డాక్టర్ రాకేష్‌కుమార్ సహాయ్, డాక్టర్ కె.సుధీర్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ప్రస్తుతం కొనసాగుతున్న కంటి స్క్రీనింగ్ కార్యక్రమాన్ని ఎల్వీప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించగా ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ డాక్టర్ పద్మజకుమారి రాణి మధుమేహ రోగుల కంటి పరీక్షల ప్రాముఖ్యతను తెలియజేశారని తెలిపారు. ఈసందర్భంగా డాక్టర్ శ్యామ్ కలవలపల్లి రచించిన 52 సూత్రాల ఆఫ్ డయబెటిస్ పుస్తకాన్ని ఐడియా క్లినిక్ విడుదల చేసిందన్నారు. ఈ 5కె రన్‌లో డాక్టర్ ఉపమా చక్రవధనుల, డాక్టర్ రామకృష్ణ జానపాటి, డాక్టర్ భావని కలవలపల్లి, డాక్టర్ శిరీషారెడ్డి, డాక్టర్ నందినిరెడ్డి, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

బీజేపీ నేతల సంతాపం

హైదరాబాద్ సిటీ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): సౌదీలో జరిగిన రోడ్డు ప్రమాదంలో విద్యానగర్‌కు చెందిన నసీరుద్దీన్ కుటుంబంలో 18మంది మృతి చెందడం పట్ల బీజేపీ అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడు పాశం సాయికృష్ణయాదవ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రోయ్యూరు శేషసాయి, నగర కార్యవర్గ సభ్యులు కౌండిన్య ప్రసాద్, బీజేపీ ముషీరాబాద్ అసెంబ్లీ కన్వీనర్ రమేష్‌రామ్‌లు బాధిత కుటుంబాన్ని పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు.

ఫ్లైఓవర్ పైనుంచి దూకి వ్యక్తి ఆత్మహత్య

రాజేంద్రనగర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఫ్లైఓవర్ నుంచి దూకి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన శివరాంపల్లిలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దుబాయ్ నుంచి మూడు నెలల క్రితం హైదరాబాద్‌కి వచ్చిన అజీమ్(45) ఫలక్‌నుమాలో నివసిస్తున్నాడు. ఆదివారం ఫలక్‌నుమా నుంచి ఆరాంఘర్‌కు వచ్చి మన్మోహన్ సింగ్ ఫ్లైఓవర్‌పై నుంచి దూకి ఆత్మహత్యకు యత్నించాడు. తీవ్ర గాయాల పాలైన అతడిని స్థానికులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. అజీమ్‌ను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కేసు నమోదు చేసుకొని అత్తాపూర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా అజీమ్ మానసిక పరిస్థితి బాగా లేనట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపారు.

ఉరేసుకుని ఆటోడ్రైవర్ ఆత్మహత్య

బర్కత్‌పుర, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కుమారుడు చనిపోవడంతో తీవ్ర మనోవేదనకు గురైన ఆటోడ్రైవర్ మద్యానికి బానిసై ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కాచిగూడ పీఎస్ అడ్మిని ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. సంజీవయ్యనగర్‌లో నివాసం ఉంటున్న పకీర కుమారుడు జె. నరేష్(32) వృత్తిరీత్యా ఆటోడ్రైవర్. అతనికి భార్య ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. గత డిసెంబర్‌లో కుమారుడు క్యాన్సర్‌తో మృతిచెందాడు. అప్పటి నుంచి తీవ్ర మనోవేదనకు గురైన నరేష్ మద్యానికి బానిసయ్యాడు. సోమవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ సమయంలో భార్య శిరీష పుట్టింటికి వెళ్లింది. తిరిగి వచ్చేసరికి ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.